

# సూర్య

నేటి దినపత్రిక


www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం

15 డిసెంబర్ 2025 పేజీలు : 08


## "గ్రామీణ రోడ్లకు" మోక్షం ఎప్పుడో..?



- మర్రిపాడులో అధ్వాన్నంగా రహదారులు
- ఇబ్బందుల్లో ప్రయాణీకులు, వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

మర్రిపాడు మండలంలో గ్రామీణ రహదారులు అధ్వాన్నంగా మారాయి. దీంతో ప్రయాణీకులు, వాహన చోదకులు నానా అవస్థలు పడుతున్నారు. మండలంలో ఏ పల్లెకు వెళ్దామన్నా.. మోకాల్లోతు గుంతలతో రహదారులు దర్శనమిస్తున్నాయి. రహదారులు నిర్మించి ఏళ్లు గడుస్తున్నా, ప్యాచ్ పనులు కూడా చేయకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఇటీవల కురిసిన తుఫానుల కారణంగా రహదారులు మరింతగా దెబ్బతిని దర్శనమిస్తున్నాయి. అందుకు సంబంధించిన అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో ఈ రహదారులకు మోక్షం ఎప్పుడో.. అని పలువురు చర్చించుకుంటున్నారు. - **వివరాల్లోకి వెళితే..**




**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :**

మర్రిపాడు మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వాన్నంగా తయారై దర్శనమిస్తుండడంతో అటు వాహన చోదకులకు.. ఇటు ప్రయాణీకులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఫలితంగా ప్రమాదాలు కూడా సంభవిస్తుండడంతో రహదారుల్లో ప్రయాణించాలంటే హడలెత్తిపోతున్నారు. గత ఐదేళ్ల నుంచి ఆ రహదారులకు కనీసం మరమ్మతులు కూడా చేసిన పాపాన పోకపోవడంతో మోకాల్లోతు గుంతలతో దర్శనమిస్తున్నాయి. మర్రిపాడు మండలంలో ప్రధానంగా సింగనపల్లి, కంపసముద్రం, పెగళ్లపాడు పల్లవోలు, వెంకటాపురం, నందవరం నుండి ఉదయగిరికి వెళ్లే రహదారితోపాటు పడమటి నాయుడుపల్లి, ఇర్లపాడు, భీమవరం, తదితర గ్రామాలకు వెళ్లే రహదారులు మరింత దారుణంగా తయారయ్యాయి. గత పది ఏళ్ల క్రితం నిర్మించిన ఈ రహదారులు నేడు గుంతలమయంతో దర్శనం ఇస్తున్నాయి. నిర్మించిన నాటి నుంచి నేటికీ ఆ రహదారులు వైపు కన్నెత్తి

మిగతా 7

## రాపూరులో రేషన్ బియ్యం @ రూ.20





- ప్రైవేట్ వ్యాపారుల దోపిడీ యధేచ్ఛగా రేషన్
- రూ.15 నుంచి రూ.20 దాకా రేషన్ బియ్యం దుకాణాలకు అమ్మకాలు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ..?

దారిద్ర్య రేఖకు దిగువ ఉన్న ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న చౌక బియ్యాన్ని కొంత మంది దుర్వినియోగం చేస్తున్నారు. ప్రతినెలా ఆ బియ్యాన్ని.. పక్కదారి పట్టిస్తున్నారు.

## ఇరిగేషన్ పనులపై సీబీఐ విచారణకు సిద్ధమా!

### సోమిరెడ్డికి కాకాణి సవాల్



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :**

గత ప్రభుత్వంలో జరిగిన ఇరిగేషన్ పనులు, కూటమి ప్రభుత్వంలో జరిగిన ఇరిగేషన్ పనుల్లో దొంగ బిల్లుల వ్యవహారంపై సోమిరెడ్డికి చిత్తశుద్ధి ఉంటే సీబీఐ చేత విచారణ జరిపించాలని మాజీ మంత్రి, వైసీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి సవాల్ విసిరారు. పొదలకూరు మండలం నల్లపాళెం గ్రామంలో ఆదివారం పర్యటించిన కాకాణి రైతులతో



## అభివృద్ధి, సంక్షేమాన్ని సమ్మిళితం చేసుకుంటూ..

# గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి కృషి

- **దేవాదాయ శాఖ మంత్రి ఆనం**

**సంగం/ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :**

రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి అభివృద్ధి, సంక్షేమం సమ్మిళితం చేసుకొని కృషి చేస్తున్నామని, చర్యలు తీసుకుంటున్నామని, పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తున్నామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఉదయం సంగం మండలం మక్తాపురం గ్రామంలో రూ.63 లక్షలతో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్లను మంత్రి ప్రారంభించారు. అలాగే రూ.32 లక్షలతో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరించి భూమిపూజ చేశారు. గ్రామానికి విచ్చేసిన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి గ్రామ ప్రజలు, నాయకులు ఘన స్వాగతం పలికారు. గ్రామస్తుల కోరిక మేరకు గ్రామంలోని శివాలయాన్ని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సందర్శించారు. శివాలయ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు సహకారం అందించాలని గ్రామస్తులు మంత్రిని కోరగా, దేవాదాయశాఖ అధికారులను పంపించి అంచనాలు తయారు చేయించి ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయిస్తామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన >> 2లో..

# కార్పొరేషన్‌లో.. ఇకపై ఇన్‌ఛార్జ్ మేయర్‌తో పాలన



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నగర పాలక సంస్థ మేయర్ పొట్లూరి స్రవంతి ఆదివారం తన రాజీనామా లేఖను.. ఆమె ప్రతినిధుల ద్వారా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అందించారు. దీంతో ఇక నగరపాలక సంస్థలో ఇంచార్జి మేయర్‌ను నియమించాల్సి ఉంది. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి మేయర్ స్రవంతి రాజీనామాకు సంబంధించిన నివేదిక.. నగరపాలక సంస్థ అధికారులకు పంపాల్సి ఉంది. దీంతో నగరపాలక సంస్థ అధికారులు ఇన్చార్జి మేయర్ నియమకానికి సంబంధించి నగరపాలక సంస్థలో ఉన్న ఇద్దరు డిప్యూటీ మేయర్లు రూప్‌కుమార్ యాదవ్, తహసిన్ పేర్లు ప్రభుత్వానికి నివేదించనున్నారు. దీంతో మున్సిపల్ శాఖ ఉన్నతాధికారుల నుంచి లిఖిత పూర్వకంగా ఇన్చార్జి మేయర్ పేరు రావాల్సి ఉందని సమాచారం. దీనికి సంబంధించి వెంటనే ప్రక్రియ జరగవచ్చని తెలిసింది. నగర పాలక సంస్థలో ఈనెల 18వ తేదీ మేయర్ స్రవంతిపై అవిశ్వాస తీర్మానం జరుగుతుందని అనుకోగా, మేయర్ స్రవంతి ఎవరు ఊహించని విధంగా తన పదవికి రాజీనామా చేయడంతో, అవిశ్వాస తీర్మానం లేకుండా పోయింది. ఇప్పటికే నగరపాలక సంస్థలో తెలుగు దేశం పార్టీ కార్పొరేటర్లు 42 మంది ఉన్నారు. వైసీపీకి సంబంధించి కొద్ది మంది మాత్రమే కార్పొరేటర్లు ఉన్నారు. మేయర్ స్రవంతి తన పదవికి రాజీనామా చేసి తటస్థంగా ఉన్నారు. ఏ పార్టీతో సంబంధం లేకుండా ఉన్నారు. తాను మేయర్ పదవికి రాజీనామా చేసినప్పటికీ కార్పొరేటర్‌గా ప్రజలకు అందుబాటులో ఉంటానని ప్రకటించారు. నగర పాలక సంస్థలో సీనియర్ డిప్యూటీ మేయర్ అయిన రూప్ కుమార్ యాదవ్‌నే ఇన్చార్జి మేయర్‌గా ప్రభుత్వం నుంచి నియమించే విధంగా ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉందని పలువురు చర్చించుకుంటున్నారు. మొత్తం మీద ఇక నగరపాలక సంస్థలో ఇన్చార్జి మేయర్‌తో కొంతకాలం పాలన సాగనుంది.

# రాపూరులో రేషన్ బియ్యం@ రూ.20

**రాపూరు, మేజర్‌న్యూస్ :** దారిద్ర్య రేఖకు దిగువ ఉన్న ప్రజలకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని కొంత మంది దుర్వినియోగం చేస్తున్నారు. ప్రతి నెలా పేదవారికి ఉచితంగా ప్రభుత్వం అందించే రేషన్ బియ్యం కాస్త.. పక్కదోవ పడుతుంది. తెల్ల రేషన్ కార్డుదారులు ప్రతినెల వారికి ప్రభుత్వం నుండి వచ్చే ఉచిత రేషన్ బియ్యాన్ని నేరుగా ప్రైవేటు దుకాణాలకు అధిక రేట్లకు విక్రయిస్తున్నారు. కార్డు లబ్ధిదారుల నుండి ప్రైవేటు దుకాణదారులు రూ.13లకు కొనుగోలు చేసి దర్జాగా మార్కెట్లో రేషన్ బియ్యాన్ని 15 నుండి 20 రూపాయల వరకు విక్రయాలు యదేచ్ఛగా సాగిస్తున్నారు. కెనరా బ్యాంకు వీధి, ఆర్టీసీ బస్టాండ్ సమీప ప్రాంతాల్లో రేషన్ బియ్యం ఉన్నాయా.. అని అడిగితే 20 రూపాయలు కేజీ అని సమాధానం చెప్పడం కాకుండా, ఖచ్చితంగా 20 రూపాయలు కేజీ రేషన్ బియ్యానికి ప్రైవేటు దుకాణదారులు వసూలు చేస్తున్నారు. అసలు ఇటువంటి అధిక రేట్లను నిర్ణయించే హక్కు, అధికారం ఆ ప్రైవేటు వ్యాపారస్తులకు ఎవరు ఇచ్చారు ? అనేది ప్రశ్న.. స్థానిక అధికారులకు ఈ విషయం తెలిసినా కూడా ఎందుకు దాడులు, తనిఖీలు చేయడం లేదో తెలియడం లేదని, కనీసం వారి మీద చర్యలు తీసుకోవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. రూ.10 రేషన్ బియ్యం కొనుగోలు చేసి రూ.20లకు అమ్మడం ఎంత వరకు న్యాయం ? ఇది దుర్మార్గం కదా.. అని



పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ దుకాణాలకు విచ్చేసి కొందరు లబ్ధిదారుల నుండి రేషన్ దుకాణదారులే కేజీ 10 నుండి 12 రూపాయలు వరకు కొనుగోలు చేసి బయట ప్రైవేటు వ్యాపారస్తులకు 15 నుండి 16 రూపాయల వరకు దర్జాగా విక్రయాలు సాగిస్తున్నారు. వేలిముద్ర వేయించుకోవడం డబ్బులు ఇవ్వడం తప్ప.. బియ్యం ఇవ్వడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బియ్యం కావాలని అడిగితే, అయిపోయాయని, కావున మీకు డబ్బులు ఇస్తున్నాం.. తీసుకోండి.. అని చెబుతున్నారని పలువురు రేషన్ లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ బియ్యం ఇవ్వాల్సిన తేదీల్లో కాకుండా ముందుగానే పంపిణీ కార్యక్రమం సాగించి ప్రతి నెల కంటిన్యూగా రేషన్ ఇచ్చే సమయానికి దుకాణాలకు వెళ్లిన లబ్ధిదారులకు తీవ్ర నిరాశ ఎదురవుతుంది. అంటే అప్పటికే ప్రైవేటు దుకాణదారులకు రేషన్ దుకాణాల నుండి 12 నుండి 14 రూపాయల వరకు రేట్ నిర్ణయించి అమ్మేస్తున్నారు. దీంతో వివిధ రకాల దుకాణాల్లో ప్రవేట్ వ్యాపారస్తులు 16 నుంచి 20 రూపాయల వరకు ప్రజల నుండి వసూలు చేస్తున్నారు. ఒక్క కేజీ రేషన్ బియ్యం 20 రూపాయలు అంటే రాపూరు ప్రాంతంలో ఏ మేరకు రేషన్ బియ్యం లబ్ధిదారుల కాకుండా ప్రైవేటు దుకాణాలకు చేరుతున్నాయో చెప్పకనే అర్థమవుతుంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు ప్రైవేట్ దుకాణాలపై దాడులు నిర్వహించి కఠినమైన చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు తమకు రేషన్ దుకాణాల నుంచి రావాల్సిన దేశం బియ్యం సకాలంలో ఇవ్వకుండా ముద్ర వేయించుకొని బియ్యం అయిపోయే అని చెప్పడం, కేజీ 10 రూపాయలు వంతున ఇవ్వడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రజలు అధికారులను నిలదీస్తున్నారు. చౌక దుకాణాల బియ్యం పక్కదారి పట్ల సంబంధిత శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇటువంటి కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇకనైనా రెవెన్యూ, సివిల్ సప్లై, పోలీసు, విజిలెన్స్ శాఖ అధికారులు తరపున తనిఖీ చేయడం ప్రైవేట్ వ్యాపారస్తుల దుకాణాలను తనిఖీ చేస్తే రేషన్ బియ్యం బస్తాలు బస్తాలుగా బయటపడతాయన్న అభిప్రాయం సర్వత్ర వ్యక్తం అవుతుంది.

### అభివృద్ధి, సంక్షేమాన్ని సమ్మిళితం చేసుకుంటూ..

## గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి కృషి

*(మొదటి పేజీ తరువాయి)*



కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన ఈ 18 నెలల కాలంలో అభివృద్ధిని పట్టాలెక్కిస్తూ కోట్లాది రూపాయలతో గ్రామాల్లో మౌలిక వసతులకు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. మక్కాపురం గ్రామంలో ఈ ఒక్కరోజే అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. ఈ ఒక్క గ్రామంలోనే ప్రతినెలా 209 మందికి రూ.1.33 కోట్లు సామాజిక పింఛన్లు చెల్లిస్తున్నట్లు చెప్పారు. ఆటో డ్రైవర్ల సేవలో పథకం కింద 11మందికి రూ.15వేలు చొప్పున చెల్లించినట్లు చెప్పారు. తల్లికి వందనం పథకం కింద 182 మందికి 27.30 లక్షలు జమ చేశామన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద 66 లక్షల రూపాయలను రైతుల ఖాతాలో జమ చేసినట్లు చెప్పారు. ఒక్క సంగం మండలంలోనే 143 వివిధ పనులకు 12.96 కోట్ల రూపాయలను మంజూరు చేసినట్లు చెప్పారు. పెద్ద ఎత్తున రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ప్రత్యేకంగా మంత్రి ఆనం ధన్యవాదాలు తెలిపారు. అలాగే సంగం మండలంలో విలేజ్ హెల్త్ క్లినిక్‌ల భవన నిర్మాణాలకు రూ.2.72 కోట్లు మంజూరైనట్లు మంత్రి ప్రకటించారు. త్వరలోనే టెండర్లు పూర్తిచేసి పనులు మొదలు పెడతామని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నప్పటికీ గ్రామాలకు ఏం కావాలో అన్నీ తెలుసుకుని ఆయా ప్రాంతాలను కోట్లాది రూపాయలు వెచ్చించి సమగ్రంగా అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు

### పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి :

విద్యుత్ పొదుపుతో పాటు ఆదాయాన్ని సమకూర్చే అనేక ప్రయోజనాలు ఉన్న ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని మంత్రి ఆనం పిలుపునిచ్చారు. ఈ పథకం ద్వారా సోలార్ విద్యుత్ ను ప్రజలకు చేరువ చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా ఆయన చెప్పారు. ఈ పథకం ద్వారా ఎస్సీ ఎస్టీలకు పూర్తి ఉచితంగా సోలార్ విద్యుత్ కనెక్షన్లు అందిస్తున్నట్లు చెప్పారు. బీసీలకు కూడా కేంద్ర ప్రభుత్వ సబ్సిడీతో పాటు 20వేలు రూపాయలు సబ్సిడీ అందించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించినట్లు చెప్పారు. ఆత్మకూరు నియోజకవర్గానికి పదివేల కనెక్షన్లు మంజూరు అయినట్లు చెప్పారు. ఈ గొప్ప అవకాశాన్ని ప్రజలందరూ అవగాహన చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని ఆనం పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో పావని, పంచాయతీరాజ్ ఈఈ సుబ్బరాజు, తాసిల్దార్ సోమ్లా నాయక్, స్థానిక నాయకులు చెన్నూరు మోహన్ రెడ్డి, సునీల్ రెడ్డి, కేశవ చౌదరి, గిరి నాయుడు, రవీంద్రారెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇరిగేషన్ పనులపై సీబీఐ విచారణకు సిద్ధమా !



*(మొదటి పేజీ తరువాయి)*

పలు విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోమిరెడ్డి తన మాటల్లో నిజాయితీ ఉంటే, షట్టర్లు బిగించకుండా దొంగ బిల్లులు చేసుకున్నారంటూ చేసిన వ్యాఖ్యలుపై పూర్తిస్థాయి విచారణ జరిపించి దోషులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విలువలేని సోమిరెడ్డి మాటలను పట్టించుకోం కానీ, ఆయన అవినీతిని మాత్రం ఎండగడుతూనే ఉంటామన్నారు. కాకుటూరు శివాలయం భూములను సోమిరెడ్డి లేఔట్ యజమానులకు అమ్మేసి దేవుడికే శఠగోపం పెట్టారని, అలాంటి వ్యక్తికి ప్రజలు ఒక లెక్క కాదన్నారు. సోమిరెడ్డి, సోమిరెడ్డి కొడుకు గొలగమూడి రోడ్డులో సంతను ఏర్పాటు చేసి నెలకు రూ.5 లక్షలు వసూలు చేస్తూ.. అక్కడ గోవులను అమ్ముకునేవారికి వంతపాడుతున్నారని ఆరోపించారు. సోమిరెడ్డి ఇసుక, గ్రావెల్, మట్టి, బూడిద ఇలా అన్నింటిలో మాఫియాలా పెట్రేగిపోతూ ప్రకృతి సంపదను దోచుకుంటూ ప్రతినెల కోట్లాది రూపాయలు వెనకేసుకుంటున్నారని విమర్శించారు. చివరకు బ్రాందీ షాపులను కూడా వదలకుండా కమీషన్లు తీసుకుంటూ.. సర్వేపల్లిలోని ప్రతి బెల్టుషాపు నుండి మాముళ్లు దండుకుంటున్నాడని ఘాటు వ్యాఖ్యలు చేశారు. పనులు చేయకుండానే, మోంథా తుఫాను పేరిట 16 కోట్ల 90 లక్షల రూపాయలు దోచుకునేందుకు రంగం సిద్ధం చేశాడని దుయ్యబట్టారు. ఇప్పుడు దిత్వా తుఫానులో కోట్ల రూపాయల పనుల మంజూరుకు ప్రయత్నిస్తూ రైతులను అడ్డుపెట్టుకొని దండుకుంటున్నాడని ఆరోపించారు. ఇరిగేషన్ పనులలో సోమిరెడ్డి అవినీతిపై వివరాలు సేకరించి, ప్రతి ఊరు, వాడ ప్రజల సమక్షంలో సభలు ఏర్పాటు చేసి వివరిస్తామన్నారు. సోమిరెడ్డి ఉడత ఊపులకు ఇక్కడ భయపడే పిరికివాళ్లు ఎవరూ లేరన్నారు. సోమిరెడ్డి కాంట్రాక్టర్లు, ఇంజనీరింగ్ అధికారులను బెదిరించి, బ్లాక్ మెయిల్ చేసి, వారి నుండి పర్సంటేజీలు రాబట్టుకునే పనిలో బిజీగా ఉన్నారని తెలిపారు. సోమిరెడ్డి మాటల్లో నిజాయితీ ఉంటే కట్టుకథలు మాని గత ప్రభుత్వంలో జరిగిన ఇరిగేషన్ పనులపైన నేడు జరుగుతున్న ఇరిగేషన్ పనులపైన సిబిఐ విచారణ జరిపించేందుకు సిద్ధపడాలన్నారు. సోమిరెడ్డి, ఆయన కొడుకుల అవినీతిని, సోమిరెడ్డికి వంతపాడిన అధికారులపైన వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల్లో, రైతుల సమక్షంలోనే బహిరంగ విచారణ చేపట్టి అవినీతిని రుజువు చేసి చర్యలు చేపడుతామని తెలిపారు. ఇరిగేషన్ పనుల దొంగ బిల్లుల వ్యవహారంలో సోమిరెడ్డి, సోమిరెడ్డి కొడుకుతో పాటు, ఎంతమంది ఇంజినీర్లు జైళ్లకు వెళ్తారో ముందు ముందు ప్రజలే చూస్తారన్నారు. అధికారం ఉన్నా, లేకున్నా సర్వేపల్లి ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ఏ అవసరం వచ్చినా ఇంటి మనుషిలా అండగా ఉంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు బచ్చల సురేష్ కుమార్ రెడ్డి (చిన్ని), గోగిరెడ్డి గోపాల్ రెడ్డి,పలుకూరు పోలిరెడ్డి,పామూరు లచ్చా రెడ్డి,జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షులు ఉయ్యాల ప్రతాప్ రెడ్డి, మండల యువజన విభాగం బొర్రా సంతోష్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ చవడం హరి, నంది శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

# పాలూరులో విచారణ చేపట్టిన ఆర్డీఓ

## హడావిడిగా విచారణ గందరగోళంలో మాదిగ దళిత రైతులు





**సైదాపురం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా సైదాపురం మండలం పాలూరు అరుంధతి వాడలో నెల్లూరు జిల్లా ఆర్డీఓ పత్రిక ప్రకటన ద్వారా వెలువడిన సమాచారంతో ఆదివారం గ్రామంలోని రైతులతో మాట్లాడి అనంతరం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు ఆమె మాట్లాడుతూ.. రైతులకు సంబంధించి పట్టాలు మంజూరు చేయాలని రైతులు తెలియచేశారు జిల్లా కలెక్టర్‌కి తెలియజేసి పట్టాలు మంజూరు అయ్యేలా చేస్తామని ఆమె మీడియా ముఖంగా తెలిపారు. పాలూరు మాదిగ రైతులు తెలిపిన వివరాల మేరకు ఆర్డీవో రాకముందే సొసైటీ చైర్మన్ సుబ్రహ్మణ్యం నాయుడు పక్క గ్రామాల నుంచి మనుషులను తరలించి, కొన్ని మీడియా సంస్థలకు 'తాను ఒక్క రూపాయి కూడా వసూలు చేయలేదంటూ తప్పుడు ప్రకటనలు ఇప్పించాడని మాదిగ రైతులు ఆరోపించారు. అయితే పాలూరు గ్రామానికి చెందిన రైతులు స్వయంగా ఆర్డీవోకు ఒక్కొక్కరి నుంచి రూ.30వేల చొప్పున వసూలు చేసిన విషయాన్ని వివరించినా, ఆమె ఆ మాటలను పెడచెవులు పెట్టి 'పట్టాలు ఇస్తా' అంటూ హడావుడిగా వెళ్లిపోయారని వాపోయారు.

### కలెక్టర్ స్వయంగా రావాలని విజ్ఞప్తి

ఆర్డీవోపై విశ్వాసం కోల్పోయిన పాలూరు మాదిగ రైతులు, జిల్లా కలెక్టర్ స్వయంగా గ్రామానికి వచ్చి క్షేత్రస్థాయిలో జరుగుతున్న అన్యాయాన్ని పరిశీలించాలని వేడుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం టీడీపీ నేతల పెత్తనం కొనసాగుతూనే ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇకనైనా ప్రభుత్వం, అధికారులు చొరవ తీసుకుని టీడీపీ నేతల అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని, దళిత రైతుల భూములను కాపాడి వారికి న్యాయం చేయాలని పాలూరు మాదిగ రైతులు మీడియా ముఖంగా డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భర్త తలమల మస్తానయ్య, మాదిగ దళిత రైతులు, గ్రామస్తులు ఇదరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు చదువుతోపాటు ఆటలు, క్రీడలు ఆవశ్యకం

- 'అపుస్మా' క్రీడాపోటీలు అభినందనీయం
- నిత్యాన్నదాత కంచి పరమేశ్వరరెడ్డి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** విద్యార్థులకు విద్యతోపాటు ఆటలు, క్రీడలు కూడా అత్యంతావశ్యకమని నిత్యాన్నదాత, శ్రీసాంబశివచారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్, అనేక సామాజికసేవా కార్యక్రమాల సేవాప్రదాత కంచి పరమేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం అపుస్మా (ఆంధ్రప్రదేశ్ ఎన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బి.మనోహర్‌రెడ్డి స్మారక క్రీడాపోటీలను ఏర్పాటు చేయగా ముఖ్యఅతిధిగా కంచి పరమేశ్వరరెడ్డి పాల్గొన్నారు. పరమేశ్వరరెడ్డి జాతీయజెండాను ఆవిష్కరించగా మరో అతిధిగా హాజరైన అపుస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి క్రీడాపతాకాన్ని ఎగురవేశారు. క్రీడాకారుల వందనాన్ని స్వీకరించిన అనంతరం పోటీలను అతిధులు ప్రారంభించారు. 14 పాఠశాలలకు చెందిన వందలాదిమంది ఈపోటీలకు హాజరుకాగా కంచి పరమేశ్వరరెడ్డి వారందరికి భోజనసౌకర్యం కల్పించారు. అపుస్మా జిల్లా కార్యదర్శి ఎస్.రామ్మోహన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ప్రారంభ సమా వేశంలో కంచి పరమేశ్వరరెడ్డి ప్రసంగిస్తూ విద్యార్థులను ఆటలు, క్రీడల్లో కూడా ప్రోత్సహించడం అవసరమని, ఉత్తమ విద్యతోపాటు క్రీడా ప్రతిభను కూడా అలవరచాలని ఆయన కోరారు. ప్రవేటు విద్యాసంస్థలు ఈవిధంగా క్రీడాపోటీలను నిర్వహించబూనడం అభినందనీయమన్నారు. అపుస్మా ఆధ్వర్యంలో తమ హక్కులను పరిరక్షించుకుంటూ తమ విద్యా సంస్థల్లో విద్యార్థులకు శ్రద్ధాసక్తులతో బోధనగావించడంతోపాటు ఉపాధ్యాయ దినోత్సవాలు, ప్రతిభాపురస్కారాలు, ఆటలు,క్రీడల పోటీలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తుండడం హర్షదాయకమని పరమేశ్వరరెడ్డి పేర్కొన్నారు. అపుస్మా కార్యక్రమాలు అందరికీ స్ఫూర్తిదాయకమని కూడా ఆయన పేర్కొన్నారు. అపుస్మా కార్యక్రమాలకు తమవంతుగా సహకారమందిస్తుంటామని కంచి వెల్లడించారు.

### విద్యార్థులు క్రీడల్లో రాణించాలి : ఎంపీపీ కేతా

విద్యార్థులకు విద్యతోపాటు ఆటలు, క్రీడల్లో కూడా రాణించాలని, ఆటలు, క్రీడలు బహుళప్రయోజనకరమని ఆత్మకూరు మండలాధ్యక్షుడు, జిల్లా మండలాధ్యక్షుల సంఘ అధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఉత్తమమైన, నాణ్యమైన, నైపుణ్యాలతోకూడిన విద్య పొందడం తోపాటు ఆటలు, క్రీడల్లో ప్రావీణ్యతపొంది రాణిస్తే వారికి క్రమశిక్షణ, దేహ దారుఢ్యం, మానసిక ఉల్లాసం, విద్య,ఉద్యోగాల్లో ప్రాధాన్యత లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఆత్మకూరు నియోజకవర్గస్థాయిలో అపుస్మా ఈపోటీలను నిర్వహించడం అభినందనీయమని, భవిష్యత్తులో కూడా కొనసాగించాలని ఆయన కోరారు. ఇలాంటి పోటీలద్వారా విద్యార్థుల్లో క్రీడానైపుణ్యాలను వెలికితీయాల్సిన అవసరం ఎంతైనా ఉందని కేతా పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు తమవంతుగా సహకారమందిస్తామని వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు.

### ఐక్యతకోసం 'అపుస్మా' ప్రోత్సాహం కోసం కార్యక్రమాలు

ప్రైవేటు విద్యాసంస్థల యామాన్యాల ఐక్యతకోసం దివంగత మనోహర్‌రెడ్డి, తాను అపుస్మాను జిల్లాలో ఆవిష్కరింపజేశామని అపుస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంవి సుబ్బారెడ్డి(నేతాజి) పేర్కొన్నారు. తాము జిల్లా వ్యాప్తంగా పర్యటించి అన్ని నియోజకవర్గాల్లో అపుస్మాను బలోపేతం చేశామని, రాష్ట్రానికే ఆదర్శంగా నిలిపామని ఆయన తెలిపారు. తమ విద్యా సంస్థల్లో నాణ్యమైన విద్యనందించడంతోపాటు క్రీడాపోటీలు, ఉపాధ్యాయులకు సత్కారాలు, విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలు అందిస్తుంటామని తెలిపారు. విద్యార్థులకు నిర్వహించేలా ఆటలు, క్రీడాపోటీలను భవి ష్యత్తులో తమ ఉపాధ్యాయులకు, కరస్పాండెంట్లకు కూడా నిర్వహించే యో చనలో ఉన్నామని ఆయన తెలిపారు. ఈదఫా విద్యార్థులకు జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో నిర్వహిస్తున్నామని, అనంతరం జిల్లాస్థాయి పోటీలను నిర్వహించి విజేతలకు పతకాలు, ప్రశాంశాపత్రాలను అందజేస్తామని ఆయన పేర్కొన్నారు. ఆటలు, క్రీడల్లో కూడా విద్యార్థులు రాణించాలన్న సంకల్పంతో తాము పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. అత్యంత కోలా హలంగా ఈపోటీలను నిర్వహించిన నిర్వాహకులు సాయంత్రం నిర్వహిం చిన సభలో విజేతలకు అతిధులచేతులమీదుగా బహుమతీప్రధానం గావించారు. కార్యక్రమంలో సాంబశివచారిటబుల్ ట్రస్ట్ మెంబర్ మల్లవరపు జయేంద్రప్రసాద్‌రెడ్డి, అపుస్మా రాష్ట్ర సంయుక్తకార్యదర్శి ప్రభాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమణారెడ్డి, మర్రిపాడు ఎంఈఓ పి.తిరుపతయ్య, నియోజక వర్గ అపుస్మా అధ్యక్షుడు కోటేశ్వరరెడ్డి, కార్యదర్శి మల్లికార్జున నాయుడు, కోశాధికారి ఏ.వెంకటేశ్వర్లురెడ్డి, గౌరవాధ్యక్షుడు టీసీవీ సుబ్బయ్య, వివిధ విద్యాసంస్థల కరస్పాండెంట్లు ఓబుల్‌రెడ్డి, గార్లపాటి సురేష్‌బాబు, దొర స్వామిరెడ్డి, హరినాథ్‌రెడ్డి, ఖాజావలి, పలువురు ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## వాడి వేడిగా మండల సర్వసభ సమావేశం



**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకి మండల సర్వసభ సమావేశం నాయకుల మధ్య వాడివేడిగా జరిగింది. యూరియా పారిశుధ్యంపై నాయకులు అధికారుల మధ్య చర్చ సాగింది. వచ్చిన ఏరియా ఎటు వెళుతుందో తెలియటం లేదని, ఉప సర్పంచ్ కూరపాటి మాలకొండ రెడ్డి, ప్రశ్న లేవనెత్తగా ఇప్పటివరకు సొసైటీకి 123 తన్నులే వచ్చిందని సొసైటీ చైర్మన్ అప్పలనాయుడు సమాధానం ఇచ్చారు. ఒకచోట సొసైటీ హెడ్ ఆఫీస్ లో యూరియా అందుబాటులో ఉంచాలని మెజార్టీ సభ్యులు కోరగా జలదంకి సొసైటీ బిల్డింగ్‌ని అప్పుల్లోకి బ్యాంకు వాళ్లు తీసుకున్నారని సొసైటీ చైర్మన్ సమాధానం ఇచ్చారు. ఎంపీటీసీ కుట్టుపైన మాధవరావు జలదంకిలో పారిశుధ్యం పై ప్రశ్నించారు. నోటీసులు ఇస్తున్నారే కానీ గట్టి చర్యలు తీసుకోవడం లేదని అధికారుల తీరును వివరించారు. ఇప్పటికైనా గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఆదివారం కావడంతో అత్యధిక సంఖ్యలో అధికారులు గైర్హాజరు అయ్యారు. వ్యవసాయ పనులు కావడంతో ప్రజా ప్రతినిధులు హాజరు కూడా అంతంత మాత్రమే అయ్యింది.

## ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు

- భార్యభర్తల దుర్మరణం
- బి.చిరువెళ్ళలో విషాదం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిపై ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ఆంధ్రా ఇంజనీరింగ్ కాలేజి సమీపంలో ఆదివారం హృదయ విదారక రోడ్డు ప్రమాదం జరిగింది. మండలంలోని బోయలచిరువెళ్ళకు చెందిన చెవుల మాధవ(40), ఆయన భార్య మనోజ(37)లు ఆత్మకూరు గురుకుల పాఠశాలలో పదవతరగతి చదువున్న తమ బిడ్డవద్దకెళ్ళి తిరిగి స్వగ్రామానికి మోటర్‌సైకిల్‌పై వెళుతుండగా కడపవైపునుండి నెల్లూరు వైపుకు వెళుతున్న ఇన్నోవా కారు మోటర్‌బైక్‌ను ఢీకొంది. దాంతో బైక్ రోడ్డుఅంచుల్లోని చెట్ల పొదల్లో పడిపోగా మాధవ, మనోజ దంపతులు అక్కడే తీవ్రగాయాలతో పడిపోయి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పయారు. కారు కూడా చెట్ల పొదల్లో బోల్తాకొట్టింది. మాధవ-మనోజ దంపతులకు 17సంవత్సరాల వయసు కలిగిన మనస్విని అనే కుమార్తె ఉండగా ఇంటర్మీడియట్ చదువుతుందని, రెండవ కుమార్తె తేజస్విని ఆత్మకూరు గురుకుల పాఠశాలలో పదవతరగతి చదువుతోందని గ్రామస్థులు తెలిపారు. ఘోరరోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలిరువురు మృతిచెందడంతో ఆ బిడ్డలు అనాథలుగా మారారని గ్రామస్థులు అత్యంత ఆవేదనతో తెలిపారు. ఈసంఘటనతో బి.చిరువెళ్ళ గ్రామంలో విషాధం నెలకొంది. సంఘటన జరిగినవెంటనే ఆత్మకూరు సిఐ గంగాధర్, ఎస్ఐ జిలానీలు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాలను పోస్ట్ మార్టంకై ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

## లోక్‌అదాలత్‌లో.. నమోదైన కేసుల పరిష్కారం

**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** జిల్లా న్యాయ సేవ సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన లోక్‌అదాలత్ కార్యక్రమంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ నెల్లూరు-1 పరిధిలో ఏపీ ఎక్సైజ్, ప్రొహిబిషన్ చట్టం కింద నమోదైన కేసులను విజయవంతంగా పరిష్కరించబడ్డాయని స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.రమేష్ బాబు తెలియజేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో డిపిఎల్ కేసులు 64, ఓపెన్ కన్సంప్షన్ 91 కాగా మొత్తం 155 కేసులు స్నేహపూర్వకంగా పరిష్కారమయ్యాయని, అదేవిధంగా రూ.2,70,230/-మొత్తాన్ని జరిమానాల రూపంలో వసూలు చేయడం జరిగిందని వివరించారు. లోక్ అదాలత్ వేదికగా కేసుల పరిష్కారం జరగడం వల్ల న్యాయ ప్రక్రియ వేగవంతమై, ప్రజలకు సమయం, ఖర్చు ఆదా అయిందని, అలాగే కోర్టులపై ఉన్న భారాన్ని తగ్గించడంతోపాటు న్యాయ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం మరింత బలపడిందని తెలియజేశారు. ఇలాంటి ప్రజా ప్రయోజన కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను ఈ సందర్భంగా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ కోరుతుందని ఆయన తెలిపారు.

# క్రీడా ప్రతిభతో అత్యున్నత శిఖరాలు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** విద్యార్థులు క్రీడా ప్రతిభతో అత్యున్నత శిఖరాలను అందుకోవచ్చని అపస్మా జిల్లా అధ్యక్షులు ఎన్.శ్రీధర్ పేర్కొన్నారు. ఆదివారం వింజమూరులోని బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి బి.మనోహర్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అపస్మా మెగా స్పోర్ట్స్ మీట్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అపస్మా జిల్లా అధ్యక్షులు ఎన్ శ్రీధర్ ఎంఈఓ రమేష్ స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ మాలకొండయ్య, నియోజకవర్గం అపస్మాఅధ్యక్షులు కేవీ రత్నం, గౌరవాధ్యక్షులు మద్దూరు గోపాల్ రెడ్డి, కార్యదర్శి ఉదయశంకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో ఆటలు కూడా అంతే అవసరం అని తెలిపారు. ఆటల వలన శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఆత్మవిశ్వాసం పెంపొందించి ఏకాగ్రత అలవడు తుందని క్రీడల్లో ప్రతిభ చూపితే ఉన్నత శిఖరాలను కూడా అధిగమించవచ్చని వారు తెలిపారు. అనంతరం వివిధ విభాగాలకు చెందిన ఆటల పోటీలను నిర్వహించారు వాటిలో 100 మీటర్ల పరువు పందెంలో డి.చైతన్య సిద్దార్థ, దుత్తలూరు టీ.మణి తేజ న్యూ ఇన్ఫాంట్ కలిగిరి కే.రక్షిత సాయి ఇన్ఫాంట్ కలిగిరి 400 మీటర్ల పరుగు పందెంలో దుత్తలూరు విశ్వతేజకు చెందిన ఏ విష్ణు వింజమూరు నేతాజీ కి చెందినటి అభిలాష్ ఆర్ మధుకర్లు లాంగ్ జంప్ నందు దుత్తలూరు విశ్వ తేజకు చెందిన ఏ విష్ణు వింజమూరు ఇన్ఫాంట్ జీసస్‌కు చెందిన బి.జయప్రసాద్ రవి స్కూలుకు చెందిన ఎం చరణ్ షాట్ పుట్ నందు వింజమూరు నేతాజీకి చెందిన షేక్ షాద్ కలిగిరి పవిత్ర పాఠశాలకు చెందిన ఓ శశిధర్ దుత్తలూరు సిద్ధార్థకు చెందిన డి.చైతన్య అలాగే జూనియర్ బాయ్స్ విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో ఎస్కే ఆజాద్ అలీ నేతాజీ వింజమూరు లోకేష్ వింజమూరు సరస్వతి నేతాజీ వింజమూరు చెందిన పి వరుణ్ 200 మీటర్ల పరువు పందెంలో ఎస్కే ఆజాద్ అలీ నేతాజీ కే వంశీకృష్ణ నేతాజీ దుత్తలూరు విశ్వతేజ పి.నిఖిల్ లాంగ్ జంప్ నందు సరస్వతీ స్కూల్‌కు చెందిన జి లోకేష్ రవి స్కూల్‌కి చెందిన ఆర్ రాకేష్ దుత్తలూరు సిద్ధార్థకు చెందిన సిహెచ్ కార్తీక్ షాట్ పుట్ నందు ఇన్ఫాంట్ జీసస్‌కు చెందిన విద్యార్థి వికాస్ కలిగిరి పవిత్ర పాఠశాలకు చెందిన డి.మహేందర్ దుత్తలూరు విశ్వతేజకు చెందిన పి నిఖిల్ సీనియర్ బాలికల విభాగం నందు 100 మీటర్ల పరుగు పందెం నందు వివేకానందకు చెందిన ఎం.శరణ్య నేతాజీకి చెందిన వి.లక్ష్మి గాయత్రీ దేవి 200 మీటర్ల పరుగు పందెంలో నేతాజీ స్కూలు చెందిన వి.లక్ష్మి నిత్యశ్రీ హెూలీ ఏంజెల్స్ ఉదయగిరి చెందిన కె.రిషిత వివేకానందకు చెందిన ఎం.శరణ్య లాంగ్ జంప్ నందు ఎస్ గాయత్రీ దేవి నేతాజీ డి.రేష్మ వివేకానంద ఎస్‌డి.టార్జన్ మహియా విశ్వతేజ షాట్ పుట్ నందు రవి స్కూలు చెందిన ఏ.లావణ్య వివేకానంద కు చెందిన టి.లక్ష్మి యోగ్యత రేష్మ ఫైనల్స్ నందు 100 మీటర్ల పరుగు పందెంలో సీనియర్స్ విభాగము నందు మొదటి విజేతగా ఎం.శరణ్య శ్రీ వివేకానంద నేతాజీకి చెందిన వి.లక్ష్మి ఎస్.గాయత్రీ దేవిలు నిలిచారు. 200 మీటర్ల పరుగు పందెంలో నేతాజీ స్కూలు చెందిన వి.లక్ష్మి, నిత్య శ్రీలు రశ్మిత ఉదయగిరి హెూలీ ఏంజెల్స్ చెందిన కె.రిషిత వివేకానందకు చెందిన ఎం.శరణ్య లాంగ్ జంప్ నందు నేతాజీ కి చెందిన ఎస్ గాయత్రీ దేవి వివేకానందకు చెందిన డి.రేష్మ విశ్వతేజకు చెందిన ఎస్‌డి మహియా షాట్ పుట్ నందు రవి స్కూలు చెందిన ఏ.లావణ్య వివేకానందకు చెందిన బి.లక్ష్మీ యోగ్యత రేష్మ జూనియర్ బాలికల విభాగం నందు నేతాజీకి చెందిన ఎస్ మనస్విని సరస్వతీ పాఠశాల చెందిన తిరుపతమ్మ రవి స్కూలు చెందిన లాస్య 200 మీటర్ల పరుగు పందెం నందు నేతాజీకి చెందిన ఎం.సాత్విక మనస్విని ఇన్ఫాంట్ జీసస్ చెందిన ఎల్ షర్మిల లాంగ్ జంప్ నందు నేతాజీకి చెందిన ఎం.సాత్విక్ వివేకానందకు చెందిన జీవీ నిహారిక చెందిన వెంకట శ్రావణి త్రోబాల్ నందు సిద్ధార్థ స్కూల్ చెందిన నందిని సరస్వతీ స్కూలు చెందిన సిహెచ్ మోక్షిత ఎల్.చరిత విజేతలుగా నిలిచారు వీరికి మెమొంటోలు ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంయుక్త సెక్రటరీ పోలు అంకిరెడ్డి కోశాధికారి ఎం.శ్రీనివాసులు నాయుడు, కరస్పాండెంట్స్ ఎస్.ఐజాక్ విష్ణువర్ధన్ రెడ్డి వాసుదేవరెడ్డి ఎన్.మహేష్ విద్యార్థులు తదితరులు ఉన్నారు.




# నిన్ను నీవే ఉద్ధరించుకోవాలి : గీతలో శ్రీకృష్ణుడు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** నిన్ను నువ్వే ఉద్ధరించుకోవాలని నిన్ను ఉద్ధరించేవారు ఈ భూమి మీద ఎవరూ లేరని, ఎవరికి వారే మిత్రులని, ఎవరికి వారి శత్రువులని వారి గుణాలు, ఆలోచన ద్వారా ఇవి వ్యక్తపరచబడతాయని సీనియర్ పిరమిడ్ మాస్టర్ కామాక్షి అన్నారు. వింజమూరులోని శ్రీ వేదవ్యాసా వశిష్ట పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రం నందు ఆదివారంబి ఆత్మజ్ఞానం కార్యక్రమంలో భాగంగా ఆమె పాల్గొని భగవద్గీత యొక్క అద్భుతమైన సారాన్ని పూసగుచ్చినట్లుగా, అందరికీ అర్థమయ్యే రీతిలో చక్కగా ఉదాహరణలతో సహా వివరించారు. శ్రీకృష్ణుడు అర్జునుడికి స్వయంగా బంధువు, మిత్రుడు, ఆప్తుడు అయినప్పటికీ యుద్ధ సమయంలో అతని తరఫున యుద్ధం చేస్తానని గాని, ఆదుకుంటానని గాని చెప్పలేదని కేవలం జ్ఞానం మాత్రమే అందించి, నీ యొక్క శక్తియుక్తులతో యుద్ధం చేసి, శత్రువులను జయించాలని, నీవు యుద్ధం చేయనప్పటికీ బ్రతక గల వారెవ్వరూ లేరని చెప్పారన్నారు. కానీ అర్జునుడి తరఫున ఎలాంటి బాధ్యత తీసుకోలేదని, ఈ సత్యాన్ని మనమందరం గ్రహించాలని, అప్పుడు మాత్రమే మనం ఎదుగుతామని, ఏ దేవుడు కూడా మనకు అండగా, రక్షణగా ఉండడని మన యొక్క శక్తి యుక్తుల ద్వారానే మన పనులు పూర్తి అవుతాయన్నారు. విజయం, అపజయంకు పూర్తి బాధ్యత మనమేనని, భగవంతుడికి సంబంధం లేదని గీత ద్వారా అర్థం అవుతుందని ప్రతి ఒక్కరు గ్రహించాలని తెలియజేశారు. అనేక ఆధ్యాత్మిక పదాలకు చక్కటి అంతరార్థాలు, వాటి వివరణను ఇచ్చారు. పూజలు అనునవి మెట్టు కాదని, అవరోధమని తెలుసుకోవాలని స్వామి దయానంద సరస్వతి ద్వారా గ్రహించాలన్నారు. అన్ని దుఃఖాల నుంచి బయటపడేసే ఏకైక మార్గం ధ్యానం మాత్రమేనని నొక్కి వక్కాణిం చారు. కొన్ని ఆధ్యాత్మిక సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మిత్రులకు దేవేంద్ర చక్కటి ధ్యాన ప్రసాదం అందించారు. శాకాహారం యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తూ మహాకరుణబి శాకాహార ర్యాలీ నిర్వహించారు. ఈనెల 21వ తేదీ అంతర్జాతీయ ధ్యాన దినోత్స వం పిరమిడ్‌లో అద్భుతంగా జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ఉదయగిరి ఎమ్మెల్యే సురేష్, కేరళ నుంచి గ్రాండ్ మాస్టర్ సీమా సుభాష్ విచ్చేయుదురని, అందరూ ఈ కార్యక్రమానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు రేపటి నుంచి కొన్ని ప్రాంతాలలో పంపిణీ చేస్తారని తెలిపారు. ఆదివారం క్లాస్‌కి హాజరైన ధ్యానులందరికీ 2026 సంవత్సరం పిరమిడ్ క్యాలెండర్‌ని పంపిణీ చేశారు. మాస్టర్‌ని శాలువాతో సత్కరించారు. చిన్నారి గ్రీష్మ చేసిన చక్కటి భారత నాట్యాన్ని అందరూ ఆహ్లాదంగా తిలకించారు. ఈ కార్యక్రమానికి హాజరైన, సహకరించిన జ్ఞానాన్ని అందించిన ప్రతి ఒక్కరికి హృదయ పూర్వకమైన తెలియజేశారు. కార్యక్రమంలో హేమలత, ఉమా, రాజేశ్వరి, పద్మ, రాజ్యం, జయప్రద, నారాయణరెడ్డి, సుబ్బారెడ్డి, గురవయ్య, రవిచంద్ర, ఆచారి, రమణయ్య ఇంకా 60 మంది ధ్యానులు పాల్గొన్నారు.

## ఇస్కపల్లిలో పది మేకల అపహరణ



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండలం ఇస్కపల్లి గ్రామంలో శని వారం రాత్రి దేవుళ్ళ వెంకటేశ్వర్లు, వెంకటయ్య ఇంటి పక్కనే మేకల పాకలో ఉన్న మేకలను గుర్తు తెలియని దుండ గులు అపహరించుకొని పోయారు. రాత్రి సమయంలో అందరూ నిద్రిస్తున్న సమయంలో ఎత్తుకెళ్లడం జరిగింది. 10 మేకలు, ఒక పోతు దాదాపు లక్ష రూపాయలు విలువచేసి మేకలు పోవడంతో కుటుంబం ఘోరుణ విలపిస్తున్నారు. ఈ సమాచారాన్ని బాధితుడు పోలీసులకు అందజే యడంతో మర్రిపాడు ఎస్ఐ శ్రీనివాసులు గ్రామంలోకి వచ్చి విచారణ చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ప్రజల హక్కులను హరిస్తున్న ..

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు : ఏపీసీఎల్‌సీ

## జిల్లా మహాసభల్లో నూతన కమిటీ ఎన్నిక




**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** రాజ్యాంగబద్ధంగా ప్రజలకు ఇచ్చిన హక్కులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు హరిస్తున్నాయని పౌర హక్కుల సంఘం నేతలు ధ్వజమెత్తారు. నెల్లూరు నగరంలోని డాక్టర్ విజయ్ కుమార్ మెమోరియల్ హాస్పిటల్ సమావేశ మందిరంలో ఆదివారం పౌర హక్కుల సంఘం 18 జిల్లా మహాసభలను నిర్వహించారు. ఈ సభలో ప్రముఖ న్యాయవాది అబ్బాయిరెడ్డి, డాక్టర్ అంకిరెడ్డి, విరసం రాష్ట్ర నేత చెంచయ్య, న్యాయవాది ఎం.బ్రహ్మం తదితరులు ప్రసంగించారు. బూటకపు ఎన్‌కౌంటర్లను తీవ్రస్థాయిలో నిరసించారు. పౌర హక్కుల సాధన కోసం ప్రజాసంఘాలన్ని ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం తిరుపతిలో జనవరి 10, 11 నిర్వహించే పౌర హక్కుల సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం పౌర హక్కుల సంఘం గౌరవాధ్యక్షుడుగా ఓ.అబ్బాయి రెడ్డి, జిల్లా అధ్యక్షుడిగా ఎం.బ్రహ్మం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎల్లంకి వెంకటేశ్వర్లు ఉపాధ్యక్షులుగా కేశవులు అబ్బిరాజు, సహాయ కార్యదర్శిగా కే.సుబ్బారావు, సిహెచ్ ప్రసాద్ కోశాధికారిగా శ్యాంప్రసాద్ మరో ఆరు మందితో కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా నేత హజరత్, కుల నిర్మూలన పోరాట సమితి కావలి బాలయ్య, ఏపీటీఎఫ్ వెంకటేశ్వర రావు, ఎస్టీపీఐ అబ్దుల్ ఘని, ఓపిడిఆర్ శివ శంకర్, సామాజిక హక్కుల వేదిక జిల్లా నాయకులు రమణయ్య, యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య, కొప్పోలు రఘు తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా ప్రారంభమైన నారాయణ ప్రీమియర్ లీగ్

## చదువుతోపాటు క్రీడా పోటీలలో రాణించాలని ఆర్డీవో నాగ అనూష సూచన






**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** విద్యార్థులు చదువుతోపాటు క్రీడా పోటీల్లో కూడా రాణించాలని నెల్లూరు ఆర్డీవో నాగ అనూష పేర్కొన్నారు. ఆదివారం నగరంలో స్థానిక నారాయణ మెడికల్ కళాశాల క్రీడా మైదానంలో నారాయణ ప్రీమియర్ లీగ్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ధనలక్ష్మిపురం నారాయణ రెసిడెన్షియల్ కళాశాలల విద్యార్థులు ధనలక్ష్మిపురం నుండి నారాయణ మెడికల్ కళాశాల వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నెల్లూరు రెవెన్యూ డివిజనల్ అధికారిణి నాగ అనూష హాజరయ్యారు. ముందుగా ఆమెకు విద్యార్థులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించి ఘన స్వాగతం పలికారు. అనంతరం క్రీడాజ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడా పోటీలలో కూడా రాణించాలన్నారు. విద్యార్థి దశలో తాను కూడా ఇటువంటి క్రీడా పోటీల్లో పాల్గొనాలని గుర్తు చేశారు. ఇటువంటి పోటీల ద్వారా విద్యార్థుల్లో మానసిక ఉల్లాసంతోపాటు శారీరక దృఢత్వం లభిస్తుందని ఆమె తెలిపారు. ఏజీఎం రవి వర్మ మాట్లాడుతూ.. నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ భాస్కర్ రెడ్డి సూచనల మేరకు విద్యార్థులకు చదువుతోపాటు వివిధ రకాల క్రీడా పోటీలు, యోగ, స్కిల్ డెవలప్మెంట్ వంటి కార్యక్రమాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని అన్నారు. రెండు రోజులపాటు జరిగే ఈ లీక్ పోటీలలో నారాయణ విద్యాసంస్థల పాఠశాలల విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటుకోనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఆదిశేషయ్య కోఆర్డినేటర్ రాఘవరెడ్డి ప్రిన్సిపాల్ సుధీర్ కిరణ్ నాగమణి మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహభరితంగా సాగిన విద్యార్థుల మెడ్ వైబ్స్

- అబ్బురపరిచిన విద్యార్థుల నృత్యాలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- తమ అనుభవాలను పంచుకున్న నారాయణ పూర్వ విద్యార్థులు
- వైద్యవృత్తి పవిత్రమైనదన్న నారాయణ మెడికల్ కళాశాలల సూపరిండెంట్ హరిప్రసాద్







**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** అన్ని వృత్తుల్లోకల్లా వైద్య వృత్తి పవిత్రమైనదని, వైద్యులుగా రాణించాలంటే కొన్ని త్యాగాలకు సిద్ధపడాలని నారాయణ మెడికల్ కళాశాల, వైద్యశాలల సూపరిండెంట్ హరిప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ధనలక్ష్మిపురం నందుగల నారాయణ సిబిఎస్‌సి స్కూల్ ప్రాంగణంలో జరిగిన మెడ్ వైబ్స్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ.. వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనది అన్నారు. భవిష్యత్తులో వైద్య వృత్తిలో ప్రవేశించే విద్యార్థులు ఇప్పటినుండే కొన్ని త్యాగాలకు సిద్ధపడాలని సూచించారు. ముఖ్యంగా వైద్య వృత్తి అత్యంత గౌరవప్రదమైనదని, అంకితభావంతో పనిచేస్తేనే ఆ వృత్తికి సార్థకత లభిస్తుందని చెప్పుకొచ్చారు. నారాయణ విద్యాసంస్థల ఫౌండర్ డాక్టర్ పొంగూరు నారాయణ ఎంతోమంది వైద్యులను తయారుచేసి ప్రపంచానికి అందించారన్నారు. ఆయన సేవలు కొనియాడ దిగినవని గుర్తు చేశారు. విద్యార్థులు వివిధ రకాల వేషధారణలతో చేసిన నృత్యాలు ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో కోర్ డీన్ జయకుమార్ రాయుడు మాట్లాడుతూ.. నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి సూచనల మేరకు గత ఏడాది జాతీయస్థాయి నీట్ పరీక్ష ఫలితాల్లో ర్యాంకులు సాధించి సీట్లు పొందిన విద్యార్థులు ప్రస్తుతం రెసిడెన్షియల్ క్యాంపస్‌లో బైపిసి చదువుతున్న విద్యార్థులతో గెట్ టుగెదర్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులు తమ అనుభవాలను తెలియజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం మహేష్, మధుసూదన్ రెడ్డి, డే కాలేజీ కోర్ డీన్ కేఎస్ఆర్, డీన్ విష్ణు వర్ధని, ఏజీఎం పెంచల్ రెడ్డి కృష్ణారెడ్డి రవివర్మ, ప్రిన్సిపాల్ మాధవి, హిమబిందు, రాజశేఖర్, బోటనీ జువాలజీ ఫిజిక్స్ కెమిస్ట్రీ ఇంగ్లీష్ సాంస్క్రిట్ డిపార్ట్మెంట్ల అధ్యాపకులు నారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

# క్రీడల్లో మెరిసిన శ్రీ సరస్వతి ఆణిముత్యాలు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులోనే బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో బి.మనోహర్ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అపస్మా మెగా స్పోర్ట్స్ మీట్ నియోజకవర్గ స్థాయిలో నిర్వహించింది ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలలో వింజమూరులోని శ్రీ సరస్వతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ పాఠశాల విద్యార్థులు ఆణిముత్యాల్లా మెరిశారు. బాలికల విభాగంలో త్రోబాల్ నందు సిహెచ్ మోక్షిత చరిత తిరుపతమ్మలు బాలుర విభాగంలో జి.లోకేష్ ప్రథమ ద్వితీయ స్థానాలను సాధించి అజేయంగా నిలిచారు. ఈ విద్యార్థులను అభినందిస్తూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోలు అంకిరెడ్డి మాట్లాడుతూ.. భవిష్యత్తులో మరింత ఉత్సాహంతో నైపుణ్యంతో క్రీడలను ఆసక్తిగా అభివృద్ధి చేసుకుంటూ ఉన్నత శిఖరాలను పొందాలని ఆకాంక్షించారు. క్రీడలతోనే మంచి భవిష్యత్తును పొందువచ్చుని చదువుతోపాటు క్రీడలు కూడా అవసరమని తెలిపారు కార్యక్రమంలో యు.వెంకట్‌రెడ్డి, డి.కృష్ణారెడ్డి విద్యార్థులు తదితరులు ఉన్నారు.

# పొదలకూరులో ప్రతి రోజూ గైనకాలజీ సేవలు

- శ్రీకర్ హాస్పిటల్ మహిళా డాక్టర్



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** శారదా హాస్పిటల్ నెల్లూరు వారి ఆధ్వర్యంలో మన పొదలకూరు శ్రీకర్ హాస్పిటల్ నందు సోమవారం నుంచి ప్రతి రోజూ గైనకాలజిస్ట్ వైద్యులు అందు బాటులో ఉంటారని నిర్వాహకులు తెలిపారు. డాక్టర్ ఏ.శోభారాణి జీడీఓ ప్రతి రోజూ ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు గైనకాలజీ సేవలు అందిస్తారని చెప్పారు. సంతానలేమితో బాధపడుతున్న వారు, స్త్రీల సమస్యలు, కాన్పులు, గర్భకోశ వ్యాధులకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యం అందించబడును. పొదలకూరు పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# సేవా దృక్పథంతో గిరిజనులకు దుస్తులు పంపిణీ

- సిలోయం బాప్టిస్టుచర్చి, చైర్మన్ జి.ప్రసూన



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** సెమీ క్రిస్మస్ సెలబ్రేషన్స్ వేడుకల్లో భాగంగా సేవా దృక్పథంతో ఏసుక్రీస్తు మార్గాన్ని అనుసరిస్తూ పేదలకు దుస్తులు పంపిణీ చేశామని సిలోయం బాప్టిస్టు చర్చి చైర్మన్ జి.ప్రసూన అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఈ చర్చి నందు సెమి క్రిస్మస్ సెలబ్రేషన్స్ వేడుకల కార్యక్రమం ఘనంగా జరిగింది. విశ్వాసులు, దైవ సేవకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘ వ్యవస్థాపకులైన బూదు రు అబ్రహం సంఘ చరిత్రను తెలియజేశారు. అదేవిధంగా రెవరెండ్ గున్నం రవికుమార్ సందేశం ఇచ్చినారు. చర్చి కార్యదర్శి బుధూరు బాలు విన్సెంట్ కార్యక్రమం ఏర్పాట్లను పర్యవేక్షణ చేశారు. జాయింట్ కార్యదర్శి జె.రాజేష్, సభ్యులు విచ్చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు వివిధ వేష ధారణలతో ఏసుక్రీస్తు పాటలతో అలరించారు. అనంతరం సంఘ వ్యవ స్థాపకలు మాట్లాడారు. సెమీ క్రిస్మస్ సెలబ్రేషన్స్ వేడుకల్లో 80 మంది పేదలకు దుస్తులు అందజేసినట్లు పేర్కొన్నారు. ఏసుక్రీస్తు మార్గాలైన శాంతి, సహనం, మంచి చేస్తూ సమాజానికి ఉపయోగపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# కోలాహలంగా హిందూసమ్మేళనం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం నువ్వురుపాడు మజరా పాలజంగాలపల్లిలో శనివారం రాత్రి అత్యంత కోలాహలంగా హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికంగా భక్తులు హాజర య్యారు. నువ్వురుపాడు, అశ్వనీపురం, పాతజంగాలపల్లి గ్రామాలకు చెందిన హిందువులంతా ఐక్యత గురించి వివరించారు. రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హిందువులమంతా ఐక్యతగా ఉండాలని, దైవభక్తి కలిగి ఉండాలని వారు పేర్కొన్నారు. అనంతరం పెద్దఎత్తున మహిళలు సామూహిక హారతులిచ్చారు. స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



# ఘనంగా అయ్యప్ప మండల పూజలు



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని వేదాయపాలెంలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో ఆదివారం కేరళ సాంప్రదాయ మండల పూజలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఆలయ ప్రాంగణాన్ని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. కేరళ సాంప్రదాయ అర్చక తంత్రులు ఈ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. తొలుత అయ్యప్ప స్వామి వారికి నిర్మాల్య దర్శనం, పాలాభిషేకం, మహాగణపతి హెూమం నిర్వహించారు. దేవాలయ ప్రాంగణమంతా వివిధ సుగంధ పుష్పాలం కరణతో స్వామి వారికి ఉషః పూజ, శ్రీ వేలి ఉత్సవం, కలశపూజ, నవకాభిషేకం, ఉచ్చ పూజ, మహా పుష్పాభిషేకం, శ్రీ వేలి ఉత్సవం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం వేళ పూలంగి సేవ దర్శనం, మహాదీపారాధన, భగవతి సేవ, శ్రీ వేలి ఉత్సవం, పడి కర్పూర దీపం, హరిహరాసనం సేవలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన మండల పూజ, అన్నదానం, రాత్రి స్వాములకు బిక్ష కార్యక్రమంకు మాలెం మధుసూదన్ రెడ్డి, ఆశా దంపతులు, కీపూడి వెంకటేశ్వర్లు, రాజీవ్ మాలెం, సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలోని ఏసి సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్ వ్యాపారస్తులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమాలన్నీ అధ్యక్షులు గూడల శేషగిరిరావు, కార్యదర్శి కత్తులవెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య పర్యవేక్షణలో జరిగాయి. కమిటీ సభ్యులు కత్తి మోహన్ రావు, కేజీ శంకరన్, బొగ్గుల మురళీమోహన్ రెడ్డి, పావలా ప్రసాద్, అశోక్ చంద్ర, పలువురు అయ్యప్ప స్వామి భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కష్టంలో ఉన్న ప్రతి గుండె పవన్ వైపు చూస్తోంది



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నేనొక్కడినే కాదు తనతో పాటు పరివారం బాగుండాలి గ్రామం బాగుండాలి సమాజం బాగుండాలని ఆలోచించ గలిగిన వరల్డ్ బ్లైండ్ క్రికెట్లో కప్పు గెలుచుకున్న కెప్టెన్ దీపిక లాంటి వారిని ఆదర్శంగా సమాజానికి చూపిన పవన్ కళ్యాణ్ నాయకత్వం వర్ధిల్లాలని, న్యూరాలజీతో బాధపడుతున్న మొయిద్దీన్‌కి క్వీన్స్ లాండ్ జనసేన తరపున రూ.30వేలు ఆర్థిక సహయం చెక్‌ను జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్ గునుకుల అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దీపికకి ఉన్న సామాజిక స్పృహను అభినందించటమే కాక తక్షణమే రోడ్లు శాంక్షన్ చేయించి సాయంత్రానికి పనులు మొదలుపెట్టిన పవన్ కళ్యాణ్ కార్యదక్షతను కళ్ళు మూసుకొని జనసేన నాయకులందరూ పాటించాలన్నారు. క్వీన్స్ ల్యాండ్స్ జనసేన ఆస్ట్రేలియా సహకారంతో న్యూరాలజీతో బాధపడుతున్న మొయినొద్దీన్ కు 30వేల రూ.ల ఆర్థిక సహాయ చెక్కును వారి తండ్రి సైలెఫ్‌కి నెల్లూరు జనసేన నాయకులు జనసేన జిల్లా కార్యాలయంలో ఆదివారం అందజేశారు. ఆ సమయంలో వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అవసరం ఉందని తెలుసుకున్న క్వీన్ లాండ్స్ ఆస్ట్రేలియా జనసేన తరుపున హేమ నాయుడు, అడపా పవన్, ఇందిరా గారుబీమురళి, పగడాల ప్రసాద్ వారికి 30వేల రూపాయలు ఆర్థిక సాయం చేశారు. సమాజానికి మేలు చేసేందుకు ఒక చక్కటి వ్యూహంతో ప్రభుత్వంలోకి వచ్చి పవన్ కళ్యాణ్ అందిస్తున్న సేవలు రాష్ట్రానికే కాదు దేశానికి ఆదర్శంగా ఉన్నాయి. చిన్న చిన్న సమస్యలకే ఉలిక్కిపడే జనసేన నాయకులు కార్యకర్తలు డిప్యూటి సిఎంగా కార్యదక్షతను ఆదర్శంగా తీసుకొని వారు చెప్పింది మాత్రం చేసుకుంటూ పోతే జనసేన లక్ష్యాలను ఆశయాలను సమర్థవంతంగా నెరవేర్చగలమని ప్రతి ఒక్కరికి తెలుసుకోవాలని మనవి చేస్తున్నానని తెలియజేశారు. కష్టకాలంలో తమకి ఆర్థికంగా అండగా నిలిచి బిడ్డ వైద్యానికి సహకరించిన జనసేన టీంకి వారి తండ్రి సైలాఫ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్ గునుకుల, సీనియర్ నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, రూరల్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కార్యాలయం ఇన్‌చార్జి జమీర్, ఆత్మకూరు నియోజకవర్గ నాయకులు చదల వాడ హరీష్, ఏఎంసీ డైరెక్టర్ సురేష్, జిల్లా అధికార ప్రతినిధి కృష్ణారెడ్డి, నాయకులు రవికుమార్, గుర్రం కిషోర్, ప్రసాద్, మహేష్ శర్మ, సురేష్, మనోజు, శ్రీకాంత్, నరహరి, పవన్, వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ముమ్మాటికీ రైతుపక్షపాతి కూటమి ప్రభుత్వం : మంత్రి ఆనం

● అన్నివిదాలా రైతుల సంక్షేమం ● ఏఎంసి, సొసైటి, సాగునీటి ప్రతినిధుల ప్రమాణం : మంత్రి ఆనం





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** కూటమిప్రభుత్వం ముమ్మాటికీ రైతులపక్షపాత ప్రభుత్వం అని, రైతులకు అన్నివిదాలా ఆదుకునేలా పథకాలు అమలుచేస్తూ చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం ఆత్మకూరులోని వ్యవసాయమార్కెట్‌కమిటీ ఆవరణలో ఏఎంసి చైర్మెన్ ఆరికట్ల జనార్ధన్‌నాయుడు అధ్యక్షతన నిర్వహించిన రైతన్నామీకోసం కార్యక్రమంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆధ్వర్యం వహించారు. ఎన్టీయార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి జ్యోతిప్రజ్వలనం గావించారు. ఈసందర్భంగా రాష్ట్ర స్తాయిలో ఇటీవల వివిద కార్పోరేషన్ల డైరెక్టర్లు, ఆత్మకూరు నియోజకవర్గంలో నియమితులైన ప్రాథమిక వ్యవసాయ పరపతిసంఘాల చైర్మెన్లు, వైస్‌చైర్మెన్లు, డైరెక్టర్లు, సాగునీటిసంఘాల చైర్మెన్లు, వైస్‌చైర్మెన్లు, డైరెక్టర్లుచేత సంబంధిత అధికారుల ద్వారా ప్రమాణస్వీకారాలు చేయించారు. అనంతరం సభలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రసంగిస్తూ రాష్ట్రంలో రైతులకు సాగునీరందించేలా, విత్తనాలు, ఎరువులు సమకూర్చేలా, ధాన్యం కొనుగోలు చేసేలా అన్నీ చర్యలు తీసుకుంటుండడంతోపాటు ఎన్నికలనాటి హామీ మేరకు ప్రధానమంత్రికిసాన్‌యోజన, అన్నదాతసుఖీభవ పథకాల ద్వారా ఇప్పటికే రెండు విడతలుగా 260.5కోట్ల రూపాయలు చెల్లించామన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలకు సాగు, త్రాగునీరివ్వాలన్న సంకల్పంతో తాను నాడు-నేడు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నామని, సోమశిల ప్రాజెక్టును ఆధునీకరించామని, పుష్కలంగా నీటిని నిల్వచేసి రైతులకు సరఫరాచేయిస్తున్నామని, మెట్టప్రాంతమండలాల్లో సాగునీరందే పరిస్థితి లేకపోగా నాడు తాను అటవీఅనుమతులతో ఏఎస్‌పేట మండలానికి సాగునీరందించానని, మెట్టప్రాంతమైన మర్రిపాడు మండలానికి సోమశిల ప్రాజెక్టునుండి లిఫ్ట్ ద్వారా సోమశిల హైలెవల్‌కెనాల్‌ను 1500కోట్ల రూపాయలతో ప్రారంభించామని, అనంతరం వచ్చిన ప్రభుత్వం పట్టించుకొనకపోగా నేడు మళ్ళీ కూటమి ప్రభుత్వం రాగా ముఖ్యమంత్రి సోమశిలకు వచ్చిన సందర్భంగా వివరించి 50కోట్ల రూపాయల నిధులు మంజూరుచేయించి పనులు ప్రారంభించామని ఆనం పేర్కొన్నారు. 2సీజన్లలో సోమశిల ప్రాజెక్టునుండి జిల్లాలో 7.77ఎకరాలకు, రెండవపంటకు 5.24లక్షల ఎకరాలకు సాగునీరిచ్చామని, ఈసీజన్‌లో కూడా 7.27లక్షల ఎకరాలకు నీరిచ్చేలా ఇటీవల ఐఏబి సమావేశంలో తీర్మానించామని మంత్రి ఆనం వెల్లడించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి ప్రాంతానికి సాగు,త్రాగునీరివ్వాలన్న సంకల్పంతో యత్నించగా కొంతమేరకు సఫలీకృతమయ్యామని, నేడు కూటమి ప్రభుత్వంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ సహకారంతో పాలనాదక్షుడు,అనుభవశాలి ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ప్రత్యేక శ్రద్ధతో రైతులకు అన్నివిదాలా మేలు చేకూర్చుతున్నామని, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి నారాలోకేష్‌లు ప్రత్యేకంగా శ్రమిస్తున్నారని ఆయన వెల్లడించారు. రైతులు పంటసాగునుండి ధాన్యంకొనుగోలు వరకు అండగా ఉంటూ అనేక కార్యక్రమాలు అమలుచేస్తున్నామని, ఈ ఏడాదిలో పంటలకు గిట్టుబాటుధర కల్పించామని, ధాన్యం 22.950మెట్రిక్‌టన్నుల మేరకు కొనుగోలు చేశామని, వారికి 48గంటల్లోగా 5443కోట్ల రూపాయలు చెల్లించామని రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ నలిశెట్టి శ్రీధర్, బిజెపి సీనియర్ నాయకుడు కుడుముల సుధాకర్‌రెడ్డి, ఏఎంసి చైర్మెన్ ఆరికట్ల జనార్ధన్‌నాయుడు, సోమశిల ప్రాజెక్టు చైర్మెన్ వేలూరు కేశవచౌదరి, విజయడెయిరి డైరెక్టర్ తలచీరు సుబ్బరాయుడు, ఆత్మకూరు పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డిలు ప్రసంగించి రైతుల కోసం, అన్నివర్గాల ప్రజలకోసం, అన్నిప్రాంతాల అభివృద్ధికోసం అటు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఇటు దేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రత్యేకంగా చేస్తున్న కృషిని వివరించారు. అనంతరం రాష్ట్ర ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాక్చర్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ డైరెక్టర్ అబ్బూరు రమేష్‌నాయుడు, ఏపి ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ డైరెక్టర్ కంచర్ల మాధవి, ఏపి హ్యాండిక్రాఫ్ట్‌డెవలప్‌మెంట్ కార్పోరేషన్ డైరెక్టర్ పుట్టం శ్రీనివాసులురెడ్డిలను, ప్రమాణ స్వీకారం చేసిన మార్కెట్‌కమిటీ సొసైటీల, సాగునీటిసంఘాల చైర్మెన్‌లను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భూమిరెడ్డి పావని, మాజీ ఎమ్మెల్యే కంచర్ల శ్రీహరినాయుడు, టిడిపి నియోజకవర్గ నాయకుడు తాళ్ళూరు గిరినాయుడు, అభయాంజనేయస్వామి ఆలయ కమిటీ చైర్మెన్ కాటంరెడ్డి రవీంద్రారెడ్డి, మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి, రాష్ట్రంలోని వివిద కార్పోరేషన్‌ల డైరెక్టర్లు అబ్బూరు రమేష్‌నాయుడు, కంచర్ల మాధవి, పుట్టం శ్రీనివాసులురెడ్డి, సొసైటీల చైర్మెన్లు పరిటాల సత్యనారాయణ, యర్రమల్ల చిన్నారెడ్డి, గుండ్లపల్లి శ్రీనివాసయాదవ్, కాటంరెడ్డి నారశింహారెడ్డి, బూదళ్ళ వీరరాఘవరెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు కేతా విజయభాస్కర్‌రెడ్డి, దావా పెంచలరావు, మద్దినేని నారాయణ, శాకమూరు నారాయణనాయుడు, సోమశిలప్రాజెక్టు ఉత్తరకాలువ వైస్‌చైర్మెన్ పూనుగుంట ధనుంజయ, మండల టిడిపి అధ్యక్షులు సుంకరపెంచలచౌదరి, దేవరాల గంగాధర్ యాదవ్, జిల్లా తెలుగుయువత ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, మున్సిపల్ కౌన్సిలర్లు సూరా భాస్కర్‌రెడ్డి, కొప్పోలు రమాదేవి, మహబూబ్‌బాషా, గంధళ్ళ వేణు, పొడమేకల పెంచలయ్యయాదవ్, దగ్గుమాటి శివకోటారెడ్డి, పలువురు తెలుగుదేశం నాయకులు, ఇరిగేషన్, సోమశిల ప్రాజెక్టు, వ్యవసాయ,సహకార,రెవిన్యూ శాఖల అధికారులు, టిడిపి నాయకులు తోడేటి వెంకటయ్య, రాపూరు జనార్ధన్‌రెడ్డి, దేవరాల హజరత్తయ్య, కొప్పోలు చిన్నపురెడ్డి, గోరీషబ్బీర్, బంకా సుబ్బారెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.





# డాన్స్ కళాకారులకు గుర్తింపు కార్డ్ పంపిణీ






**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా డాన్స్ మాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉన్నటువంటి 350మంది డాన్స్ కళాకారులకు అసోసియేషన్ ఆదివారం గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా టీడీపీ నాయకులు కప్పిర శ్రీనివాసులు, మామిడాల మధు, శుభమస్తు బయ్యా రవికుమార్, కప్పిర రేవతి,కువ్వారపు బాలాజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కళా రంగంలో డాన్స్ కళాకారులకు ప్రత్యేక గుర్తింపు స్థానం ఉందని ఎక్కడ ఈవెంట్ జరిగిన డాన్స్ ప్రోగ్రాం లకు ప్రధానితో ఉంటుందని దాదాపు మూడు గంటలసేపు వారి డాన్స్‌తో ఆకట్టుకుంటారని అటువంటి డాన్స్ కళాకారులు మన నెల్లూరు జిల్లాలో ఇంతమంది ఉన్నా రనేది ఇప్పుడు చూస్తుంటే చాలా సంతోషంగా ఉందని వారు తెలియజేశారు. అదేవిధంగా జిల్లా డాన్స్ మాస్టర్ అసోసియేషన్ అధ్యక్షులు నటరాజ్ మాట్లాడుతూ.. డాన్సర్ల ముసుగులో ఎందరో మధ్యవర్తులు బయట తిరుగుతూ ఉంటారని వారికి తమకి ఎటువంటి సంబంధం లేదంటూ ఆయన తెలియజేశారు. అదేవిధంగా తమ డాన్స్ కళాకారులు ఎక్కడైనా ఎటువంటి కార్యక్రమాలు కైనా ఐడీ కార్డు తోటి వెళ్తారని అలాంటి వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోలీస్ శాఖ రక్షణ కల్పించాలని ఈ సందర్భంగా వారిని కోరారు. అనంతరం ముఖ్య అతిథులు కళాకారులకు గుర్తింపు కార్డులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు యూనియన్ స్టీరింగ్ కమిటీ సభ్యులు కోదండపాణి ఆర్టీసీ కరిముల్లా రమణయ్య నెల్లూరు మెగాస్టార్ కరిముల్లా డాన్స్ యూనియన్ ప్రెసిడెంట్ నటరాజు వైస్ ప్రెసిడెంట్ స్వప్న రెడ్డి, శ్రీ సాయి సెక్రటరీ బుచ్చి చంద్ర, ట్రెజరర్ కొడవలూరు వెంకీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇబ్రహీం తదితర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# జనవరి 10న జరుగు సాంస్కృతిక మేళా

## సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ఆదివారం ఉదయం సంతపేటలోని జిల్లా సీపీఐ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా సమితి సమావేశం జిల్లా అధ్యక్షులు గుది విజయకుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి సీపీఐ శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో కోవూరులోని సాయిబాబా గుడి పక్కన నిర్వహించే జిల్లాస్థాయి సాంస్కృతిక మేళాను జయప్రదం చేయాలని ప్రజానాట్యమండలి నాయకులకు పిలుపునిచ్చారు. అదేవిధంగా సీపీఐ పేద బడుగు బలహీన వర్గాల పక్షాన పోరాటం ప్రారంభించి ఈనెల 25వ తేదీకి 100 సంవత్సరాలు పూర్తి చేసుకుని 26వ తేదీన 101 సంవత్సరంలోకి ప్రవేశిస్తున్న సందర్భంగా జిల్లాలోని వాడవాడల సీపీఐ శతజయంతి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించడంతోపాటు జెండాలను ఎగురవేయాలని అదేవిధంగా ప్రజల పక్షాన సీపీఐ ఈ వంద సంవత్సరాల కాలంలో నిలబడి చేసిన పోరాటాలు సాధించిన విజయాలు గురించి ప్రజలకు వివరిస్తూ ప్రజానాట్యమండలి కళాకారులు ప్రజల్లోకి మన సిపిఐ భావజాలాన్ని ఘనంగా తీసుకువెళ్లే విధంగా మీరంతా పనిచేయాలని కోరారు అదేవిధంగా కోవూరులో నిర్వహించే సాంస్కృతిక మేళాను కూడా జిల్లాలో ఉండే అన్ని రంగాల కళాకారులను కలుపుకొని పెద్ద ఎత్తున నిర్వహించి ప్రజానాట్యమండలికి ప్రత్యేకమైన గుర్తింపు వచ్చే విధంగా మీ కార్యక్రమలను రూపకల్పన చేసుకోవాలని దానికి సీపీఐ ఎల్లప్పుడూ మీకు అండదండలు అందిస్తుందని అన్నారు. అదేవిధంగా జనవరి 18వ తేదీన తెలంగాణ రాష్ట్రం ఖమ్మంలో జరుగు సీపీఐ శత జయంతి ఉత్సవాల ముగింపు సభకు జిల్లా నుంచి కళాకారులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు అదేవిధంగా మన జిల్లాలో కళాకారులున్న గ్రామాలలో వీలైనన్ని చోట్ల కళాకారులకు సభ్యత్వం ఇవ్వడంతోపాటు అక్కడ జెండాలు ఎగరవేసే కార్యక్రమాలను కూడా రూపొందించాలని ఈ వంద సంవత్సరాలలో సీపీఐ అనేక పోరాటాలు నిర్వహించిందని అందువలన మన జిల్లాలో కూడా 100 జండాలు డిసెంబర్ 26వ తేదీ నాటికి ఎగరేసే విధంగా కృషి చేయాలని అందులో ప్రజానాట్యమండలి పాత్ర కీలకంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నంది పోగు రమణయ్య ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు పి.జిలాని ఖాన్ జిలాని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పి.లీలామోహన్ ఉపాధ్యక్షులు దండూరి కామేశ్వరరావు ప్రజానాట్యమలి జిల్లా కార్యదర్శి తల్లు సీనయ్య కోశాధికారి షేక్ షబ్బీర్ భాష బాబు రమేష్ సంజన స్వప్న లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# జై జై మెరిన్ ఆక్వా సీడ్ సరఫరా కేంద్రాన్ని ప్రారంభం




**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని కోడూరు బీచ్ రహదారి మార్గంలో ఆదివారం జేజే మెరీన్ ఆక్వా సీడ్ సరఫరా కేంద్రాన్ని నిర్వాహకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాండిచ్చేరి సీడ్‌కు దీటుగా నాణ్యత ప్రమాణాలలో రైతాంగానికి విత్తన సరఫరా చేస్తామన్నారు. ప్రముఖగోల్డెన్ ఈస్ట్ కోస్ట్ కంపెనీల తరహాలో అన్ని అనుమతులు లైసెన్సులు పొంది సీడును అందిస్తామని తెలిపారు. 100శాతం నాణ్యతతో కూడిన సీడ్ సరఫరా మా ద్వారా అందుతుందన్నారు. ఈ సంవత్సరం డిసెంబర్ చివరి నాటికి 2026 జనవరి మొదటి వారంలో మా కంపెనీ ద్వారా విత్తన సరఫరా జరుగుతుందన్నారు. రైతులు తమను ఈ క్రింది ఫోన్ నెంబర్ ద్వారా సంప్రదించగలరు. కంపెనీ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ నెల్లూరు సునీల్ కుమార్ 9293952238 ఈ సమావేశంలో కంపెనీ భాగస్వాములు కే.కొండయ్య, జి.శీనయ్య, నెల్లూరు సునీల్ కేవెంకటేశ్వరరావు ఉన్నారు.

# ప్రశాంత్ ఫెర్టిలిటీ సెంటర్ ప్రారంభం



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** మూడు దశాబ్దాలకు పైగా సంతాన సాఫల్యత, పునరుత్పత్తి వైద్యాల్లో అగ్రగామిగా వున్న ప్రశాంత్ ఫెర్టిలిటీ సెంటర్‌ను నెల్లూరులోని మాగుంట లేఅవుట్‌లో ఆదివారం నెల్లూరులో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సతీమణి సుజితా రెడ్డి, మాజీ మేయర్ నంది మండలం భానుశ్రీ హాజరయ్యారు. ఇంతటి ప్రపంచస్థాయి ఐవిఎఫ్ చికిత్స కేంద్రాన్ని నెల్లూరు ప్రాంత ప్రజలకి అందుబాటులోకి తీసుకువచ్చినందుకు డా. గీతా హరిప్రియను అభినందించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. ఈ సరికొత్త, సాంకేతిక అధునాతమైన కేంద్రం, ఈ ప్రాంతంలో కుటుంబాలకు ప్రశాంత్ ఫెర్టిలిటీవారి ప్రపంచస్థాయి సంతాన సాఫల్య నైపుణ్యాన్ని, మహిళలకు సమగ్ర ఆరోగ్య సంరక్షణని మరింత దగ్గర చేయడానికి కట్టుబడివుందన్నారు. ప్రశాంత్ గ్రూప్స్ హాస్పిటల్స్ చైర్ పర్సన్ పి.గీత హరిప్రియ మాట్లాడుతూ.. 1996 నుంచి తమకు నెల్లూరు జిల్లాలోని కుటుంబాలతో మంచి అనుబంధం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రశాంత హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ సంహిత మోటూరి, మస్తాన్ భాష పాల్గొన్నారు.

## కోటంరెడ్డి సుజితమ్మ చేతుల మీదుగా

# ఎసెన్స్ అండ్ ఎరా ప్రారంభం



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు మాగుంట లేఔట్ జి మార్ట్ సమీపంలో అత్యంత ఆధునిక హంగులతో ఎసెన్స్ అండ్ ఎరా బ్యూటీ సెలూన్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సతీమణి కోటంరెడ్డి సుజిత, మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ హాజరయ్యారు. జిల్లాలో ఎక్కడా లేనివిధంగా విశాలంగా 3500 స్క్వేర్ ఫీట్స్‌తో ఈ బ్యూటీ పార్లర్ ను తోట వజ్రావతి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి సతీమణి సుజిత మాజీ మేయర్ భానుశ్రీ మాట్లాడుతూ.. నెల్లూరు నగరంలో మహిళల కోసం కార్పొరేట్ స్థాయిలో ఎన్నో హంగులతో ఈ బ్యూటీ పార్లర్‌ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. హైదరాబాద్, బెంగళూరుని తలపించేలా ఏర్పాటు చేశారని దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్సెన్ అండ్ ఎరా బ్యూటీ పార్లర్ యజమాని తోట వజ్రావతి మాట్లాడుతూ నెల్లూరు మహిళలకు తన వంతుగా ఏదో ఒకటి చేయాలన్న లక్ష్యంతో ఇంత ఆధునికంగా బ్యూటీ సెలూన్ అందుబాటులోకి తీసుకొని వచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో తోట శ్రీధర్, డాక్టర్ లావణ్య, డాక్టర్ దివ్య, ఎనెల్ హాస్పిటల్ చైర్మన్ నాగేంద్రప్రసాద్, టీడీపీ నాయకులు గూటూరు శ్రీధర్ నాయుడు, తోట శోభారాణి పాల్గొన్నారు.

# గ్రామీణ రోడ్లకు మోక్షం ఎప్పుడో..?

(మొదటి పేజీ తరువాయి)

చూసిన నాథుడే లేడు. దీంతో మరమ్మత్తులు కూడా నోచుకోలేదు. ఫలితంగా ప్రయాణికులు వాహన చోదకులు నానా అవస్థలు పడుతూ ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ రహదారుల్లో బస్సు సౌకర్యం పెద్దగా లేనందున ద్విచక్ర వాహనాలతోపాటు ఆటోలు ఎక్కువగా నడుస్తుంటాయి. దీంతో ఏ గుంతలో ఏ టైరు పడి ప్రమాదం సంభవిస్తుందోనని భయాందోళన చెందుతూ ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామాల్లో సీసీ రోడ్లకు ప్రాధాన్యం ఇచ్చారు తప్ప ప్రధాన రహదారులను మరిచారు. దీంతో ప్రయాణం నరకయాతన అయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పాలకులు పట్టించుకోని రహదారులకు మరమ్మత్తులు చేయించడం గానీ, లేక నూతన రహదారులు నిర్మించడం కానీ చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# ఆలయాల్లో ఐదు పనులకు 2.50 కోట్లతో టెండర్లు



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** కృష్ణపట్నం ఆలయాల అభివృద్ధిలో భాగంగా మరో ఐదు పనులకు రాష్ట్ర ప్రభుత్వం 2.50 కోట్ల రూపాయలతో టెండర్లు పిలిచి ఉందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం సిద్దేశ్వర స్వామి, వేణుగోపాలస్వామి ఆలయాలకు నూతన పాలకమండలి నియామకం ప్రక్రియలో పదవీ ప్రమాణ స్వీకారం మహోత్సవాన్ని ఆలయాల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వి.గిరికృష్ణ వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఎమ్మెల్యే సమక్షంలో ట్రస్ట్ మండలి సభ్యుల చేత ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. ఆలయాల చైర్మన్‌గా మామిడాల శ్రీనివాసులు పదవీ ప్రమాణస్వీకారం చేయగా మరో 9 మంది సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేయడం జరిగింది. ఈ సందర్భంగా నూతన పాలకమండలికి ఎమ్మెల్యే సోమిరెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ధర్మల్ కేంద్రానికి ఆలయాల భూములు కాంగ్రెస్ ప్రభుత్వం భూసేకరణ చేయగా ఎకరాకు 7.75లక్షల రూపాయలు వచ్చేలా పోరాటం చేసినట్లు తెలియజేశారు. దేవస్థానం డిపాజిట్లను కామన్ గుడ్ ఫండ్ కింద అప్పట్లో ప్రభుత్వం తీసుకునే ప్రయత్నం చేయగా ప్రత్యేక శ్రద్ధ వహించి వెనక్కి తీసుకొచ్చామని ఎమ్మెల్యే చెప్పడం జరిగింది. కృష్ణపట్నం ఆలయాలకు 60 కోట్లకు పైగా బ్యాంక్ డిపాజిట్‌తోపాటు 53 కిలోలు బంగారం డిపాజిట్ ఉన్నట్లు ఎమ్మెల్యే అన్నారు. ఆలయ నిధులతో ముత్తుకూరులో కళ్యాణ మండపం నిర్మాణం చేస్తామని ఎమ్మెల్యే సర్వేపల్లి నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం 11.45 కోట్లు ఖర్చు పెడుతున్నట్లు పేర్కొన్నారు. ముత్తుకూరు మామిడిపూడి రోడ్డు నిర్మాణానికి 2.16 కోట్లు మంజూరు చేసినట్లు సర్వేపల్లి ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్రంలో పంచాయతీ రాజ్ రోడ్ల నిర్మాణానికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ 2100 కోట్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు నీలం మల్లికార్జున యాదవ్, జనరల్ సెక్రెటరీ శ్రీధర్ రెడ్డి, మండల తెలుగు యువత కమిటీ అధ్యక్షుడు రాగాల శివ కృష్ణ, అన్ని గ్రామాల సీనియర్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# విధులకు డుమ్మా కొడుతున్న ఉపాధ్యాయుడిపై విచారణ

▸ గ్రామానికి వెళ్లి విచారించాల్సిన అధికారి ఎంఈఓ కార్యాలయంకే పరిమితం ▸ ఎంఈఓ కార్యాలయంలోనే విచారణ



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు మండలంలోని జనార్ధనాపురం గ్రామ పరిధిలో ఉన్న ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు విధులకు ఎగనామం పెడుతున్న నేపథ్యంలో వివిధ మీడియాలో వచ్చిన కథనాలకు స్పందించిన డీఈఓ కావలి డిప్యూటీ డిఈఓ హరి ప్రసాద్‌ను విచారణకు ఆదివారం పంపారు. విచారణ అధికారి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి వాస్తవాలు తెలుసుకోవలసిన ఆయన కార్యాలయంలో కూర్చొని కార్యాలయం సిబ్బందితో పాఠశాల రికార్డులు తెప్పించుకొని పరిశీలించడం తీరు చూస్తే ఇది కేవలం కంటి తుడుపు చర్యగా మిగిలిపోతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విచారణ సమయంలో ఉపాధ్యాయుడు, ఎంఈఓ-2 కోసం డిప్యూటీ డీఈఓ హరి ప్రసాద్ రెండు గంటలు సమయంవేచి ఉండడం సుమారు 2గంటల తర్వాత ఉపాధ్యాయుడు, ఎంఈఓ-2 ఎంఈఓ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం డిప్యూటీ డీఈవో ఎంఈఓ-1, ఎంఈఓ2 ఉపాధ్యాయుడును విచారించారు. వారి నుంచి లిఖిత పూర్వకంగా సంజాయిషీ ఉత్తరం తీసుకున్నారు. అనంతరం డిప్యూటీ డిఈఓ విలేకరులతో మాట్లాడుతూ.. డీఈఓ ఆదేశాల మేరకు ప్రాథమిక విచారణ చేపట్టినట్లు ఆయన తెలిపారు. తన పూర్తి నివేదికను డీఈఓ కి పంపుతామని తదుపరి చర్యలు డీఈవో తీసుకుంటారని చెప్పారు. అయితే విచారణ ఎదుర్కొంటున్న సమయంలో ఉపాధ్యాయుడు కొరకు గతంలో విశ్రాంత ఎంఈఓగా ఉన్న వ్యక్తి, ఎంఈఓ-2 ఒకల్తా పుచ్చుకొని ఉపాధ్యాయుడికి ఏం కాదు అంటూ అభయమిస్తున్నారని ఉపాధ్యాయుల వర్గం చర్చించుకుంటున్నారు. విధులకు ఎగనామం పెడుతున్న ఉపాధ్యాయుడిపై చర్యలు ఉంటాయా లేదా అన్నది వేచి చూడాల్సిందే. ఈ విచారణ వాస్తవంగా జరుగుతుందా లేదా గ్రామస్తులు కోసం జరుగుతున్నదా అనే విషయాల్లో ఆ జనార్ధనపురం గ్రామస్తులు సందేహాన్ని వ్యక్తం చేస్తున్నారు. నిజాయితీగా విచారణ జరిపి మా పిల్లలకు ప్రభుత్వ విద్య అందే విధంగా న్యాయం చేయాలని ఆ గ్రామస్తులు కూడా కోరుకుంటున్నారు. విద్యాశాఖ అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని వాళ్లు ఆకాంక్షను వ్యక్తం చేశారు.

# వాహనదారులు తగు జాగ్రత్తలు పాటించాలి



**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని కోడూరు బీచ్‌కు వెళ్లే రహదారి మార్గంలో తోటపల్లి గూడూరు ఎస్ఐ వీరేంద్రబాబు వాహనదారులకు పలు సూచనలు చేశారు. ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆయన తెలిపారు. ఆదివారాల్లో కోడూరు బీచ్‌కు పర్యాటకులు అధిక సంఖ్యలో వచ్చే నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**ప్రధాన సూచనలు :** మద్యం సేవించి వాహనాలు నడపకూడదు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. ట్రిబుల్ డ్రైవింగ్‌కు పూర్తిగా నిషేధం. మైనర్ పిల్లలకు వాహనాలు అప్పగించకూడదు. వాహనదారుల సహకారంతోనే రహదారి భద్రత సాధ్యమవుతుందని ఎస్ఐ వీరేంద్రబాబు పేర్కొన్నారు. ట్రాఫిక్ నియమాలు పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.

## విహారయాత్రలో పలువురు కార్పొరేటర్లు

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నగరపాలక సంస్థలో ఈనెల 18వ తేదీ మేయర్ స్రవంతిపై అవిశ్వాస తీర్మానం ఉంటుందని తెలుగుదేశం పార్టీ నాయకులు ఆ పార్టీ కార్పొరేటర్లను క్యాంపు పేరుతో విహారయాత్రకు తీసుకెళ్లి నట్లు సమాచారం. అయితే మేయర్ ఒక్కసారిగా ఎవరు ఊహించని విధంగా తన పదవికి రాజీనామా చేశారు. అయితే ఇక నగరపాలక సంస్థలో అవిశ్వాస తీర్మానం లేనప్పటికీ కార్పొరేటర్లు మాత్రం విహారయాత్రలో ఉత్సాహంగా ఉల్లాసంగా ఉన్నట్లు సమాచారం. మొత్తం మీద 18వ తేదీ మేయర్‌పై అవిశ్వాస తీర్మానం ఉంటుందని ప్రచారం జరగడంతో కార్పొరేటర్లకు బాగా కలిసొచ్చినట్లు అయింది. అయితే మేయర్ ఒక్కసారిగా రాజీనామా చేయడంతో టీడీపీకి షాక్ ఇచ్చినట్లు అయింది.

## పంచాయతీరాజ్ డీఈ తీరుపై విమర్శలు



**జలదంకి, మేజర్‌న్యూస్ :** పంచాయతీరాజ్ డీఈ తీరుపై జలదంకి ఉప సర్పంచ్ కూరపాటి మాలకొండారెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. నిశపక్షపాతంగా వ్యవహరించాల్సిన డీఈ నిరంకుశ వైఖరి నిర్వహిస్తున్న అవలంబిస్తున్నారన్నారు. చేసిన పనులకు బిల్లులు పెట్టకుండా కోతలు విధించడమే కాకా ఒకరికి ఒకరకంగా మరొకరికి మరొక విధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. జలదంకి తూర్పు దరువుకి కలెక్టర్ ఆదేశాలతో అభివృద్ధి పనులు నిర్వహిస్తే ఎంబుక్ కూడా రాయకుండా తిప్పుకుంటున్నారని అన్నారు. ఓ నేత చేసిన స్వల్పపనికి అత్యధిక బిల్లులు పెట్టారని తన వద్ద ఆధారాలు ఉన్నాయని చూపించారు. ఆదివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో డీఈ తీరును ఎండగట్టారు. జలదంకి పంచాయతీలో జరిగిన పనులపై కమిటీ వేసి నిజాలను నిగ్గు తేల్చాలని ఉన్నతాధికారులను కోరారు.

## శ్రీశైల యాత్రకు బయలుదేరిన స్వాములు



**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని మల్లికార్జునపురం గ్రామం నుంచి శ్రీశైల యాత్రకు స్వాములు భక్తి శ్రద్ధలతో బయలుదేరారు. ఈ సందర్భంగా గురుస్వామి సుబ్రహ్మణ్యం శ్రీశైల క్షేత్ర ప్రాముఖ్యతను భక్తులకు వివరించారు. శ్రీశైలం వేల సంవత్సరాల చరిత్ర కలిగిన పుణ్యక్షేత్రమని, ఇది ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటిగా ప్రసిద్ధి చెందిందని ఆయన తెలిపారు. నల్లమల అడవుల మధ్య వెలసిన శ్రీశైలంలోని మల్లికార్జున స్వామి ఆలయం శివునికి అంకితం చేయబడిన మహిమాన్విత క్షేత్రమని అన్నారు. శ్రీరాముడు, ఆదిశంకరాచార్యులు వంటి మహానుభావులు శ్రీశైలాన్ని దర్శించారని పురాణ గాథలు చెబుతున్నాయని, ఇది ఆధ్యాత్మిక సత్యానికి నిధిగా భావించబడుతోందని గురుస్వామి పేర్కొన్నారు. రెడ్డి రాజుల కాలంలో కూడా ఈ క్షేత్రం విశేషంగా అభివృద్ధి చెందినట్లు ప్రజల్లో నమ్మకం ఉందన్నారు. దట్టమైన నల్లమల అడవులు, కొండ గుట్టల మధ్య వెలసిన శ్రీశైల శిఖరం సముద్ర మట్టానికి సుమారు 2,850 అడుగుల ఎత్తులో ఉందని తెలిపారు. పూర్వకాలంలో భక్తులు కొండ మార్గాలు, అడవి దారుల గుండా కాలినడకన ఈ పుణ్యక్షేత్రాన్ని చేరుకునేవారని వివరించారు. మొత్తంగా శ్రీశైలం చరిత్ర, పురాణాలు, ఆధ్యాత్మికతతోపాటు అపూర్వమైన ప్రకృతి సౌందర్యం కలిసిన ఒక పురాతన, మహిమాన్విత క్షేత్రంగా భక్తుల మనసుల్లో నిలిచిందని ఆయన అన్నారు.

## వైభవంగా అయ్యప్ప పడిపూజ



**జలదంకి, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన జలదంకిలో ఆదివారం అయ్యప్ప పడిపూజ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన పూజారి కుందుర్తి సతీష్ శర్మ అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయంలో అభిషేక కార్యక్రమాలు చేశారు. గురు స్వాములు వాకా మహాదేవ్ రెడ్డి, వడ్డె రామిరెడ్డి, రామ చంద్రారెడ్డి, తాతిరెడ్డి ఆధ్వర్యంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై పడిపూజ కార్యక్రమాన్ని తిలకించారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది.